

వివాదంగా మారిన దారి
శాంతిపురం మండలం పాకంపల్లిలో నాలుగు దళిత కుటుంబాల వారు పొలాలకు వెళ్లే దారి వివాదాస్పదమైంది. - 8లో



గ్రానైట్ పరిశ్రమ కుదేలు
కూటమి ప్రభుత్వం పర్మిట్లు జారీ చేయకపోవడంతో కుప్పం నియోజకవర్గంలో గ్రానైట్ పరిశ్రమ కుదేలైంది. - 8లో



మొదలైన మద్యం దందా
జిల్లాలోని మద్యం వ్యాపారులు సిండికేట్‌గా మారారు. అధిక ధరలకు మద్యం విక్రయిస్తూ దందాకు తెరతీశారు. - 8లో

న్యూస్‌రీల్

రేపు కబడ్డీ జిల్లా జట్టు ఎంపిక
చౌడేపల్లె : స్థానిక ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో శనివారం ఎస్‌జీఎఫ్ అండర్ -17 బాల బాలికల కబడ్డీ చిత్తూరు జిల్లా జట్టు ఎంపికకు పోటీలు నిర్వహిస్తున్నట్లు ఎస్‌జీఎఫ్ కార్యదర్శి వసంతవాణి తెలిపారు. ఉదయం 9 గంటలకు కబడ్డీ పోటీలు ప్రారంభిస్తామని పేర్కొన్నారు. జిల్లాలోని పీడీలు, పీఈటీలు తప్పనిసరిగా క్రీడాకారుల ఫామ్-బీలోని వివరాలను పూర్తిగా నింపి తీసుకురావాలని సూచించారు. ఇంటర్ విద్యార్థుల పదో తరగతి మార్కుల జాబితాతోపాటు వారు చదువుతున్న కళాశాలలో స్టడీ సర్టిఫికెట్ తప్పనిసరిగా ఉండాలని వెల్లడించారు. హెచ్ఎం నాగరాజరెడ్డి, చైర్మన్ సుధాకర్, పీఈటీ రాజేంద్ర పర్యవేక్షణలో పోటీలకు ఏర్పాట్లు చేపట్టారు.

బోయకొండలో శాస్త్రోక్తంగా చండీ హోమం
చౌడేపల్లె: ప్రముఖ పుణ్యక్షేత్రమైన బోయకొండ గంగమ్మ ఆలయంలో గురువారం శాస్త్రోక్తంగా చండీ హోమం నిర్వహించారు. ముందుగా అమ్మవారి ఉత్సవమూర్తిని యాగశాలలో కొలువుదీర్చారు. అనంతరం ఉభయదారులు ప్రత్యేక పూజలు చేశారు. తదుపరి హోమాన్ని శాస్త్రోక్తంగా చేపట్టారు. ప్రతినెలా పౌర్ణమి నాడు నిర్వహించే చండీ హోమానికి వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. పూర్ణాహుతి అనంతరం అధికారులు ఉభయదారులకు అమ్మవారి తీర్థ ప్రసాదాలు అందజేశారు. వేదపండితులు ఆశీర్వచనం చేశారు. ఆలయ ఉప కమిషనర్ ఏకాంబరం తదితరులు పాల్గొన్నారు.

ఈఈ మెరిట్ పరీక్షకు రిజిస్ట్రేషన్
చిత్తూరు కలెక్టరేట్ : ఎడ్యుకేషనల్ ఎఫిషీ సంస్థ రాష్ట్ర స్థాయిలో ఈఈ మెరిట్ పరీక్ష నిర్వహిస్తోందని డీఈఓ దేవరాజు తెలిపారు. 7 నుంచి 10వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులు అర్హులని, నవంబర్ 4లోపు పాఠశాలల హెచ్ఎంల వద్ద రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు.

అర్ధగిరిలో ఘనంగా పౌర్ణమి వేడుకలు



సుదర్శన హోమం నిర్వహిస్తున్న వేదపండితులు, అర్చకులు

తవణంపల్లె : ప్రముఖ పుణ్యక్షేత్రమైన అర్ధగిరి శ్రీ వీరాంజనేయస్వామి ఆలయంలో గురువారం పౌర్ణమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. అర్చకులు స్వామికి అభిషేకం చేశారు. అనంతరం విశేషంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. వేదపండితులు ఉభయదారులతో కలిసి సుదర్శన హోమం నిర్వహించారు. భక్తులకు ఉచితంగా ప్రసాదాలు అందజేశారు. రాత్రి ఉత్సవమూర్తిని పల్లకిలో కొలువుదీర్చి ప్రాకారోత్సవం చేపట్టారు. పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. పౌర్ణమి వేడుకల్లో ఆలయ ఈఓ హనుమంతురావు, సిబ్బంది, ఉభయదారులు పాల్గొన్నారు.

తడబడి

బైరెడ్డిపల్లి మండలం కాంచనపల్లి ప్రాథమిక పాఠశాలలో ఏడుగురు, గంగాధరనెల్లూరు మండలంలోని పేటనత్తం ప్రాథమిక పాఠశాలలో ఇద్దరు, వేపంజేరి ప్రాథమిక పాఠశాలలో నలుగురు, కుప్పం నియోజకవర్గం గుడుపల్లి మండలం పచ్చార్లపల్లి ప్రాథమిక పాఠశాలలో 12 మంది, పూతలపట్టు నియోజకవర్గం ఐరాల మండలం అగరంపల్లి హెచ్‌డబ్ల్యూ ప్రాథమిక పాఠశాలలో ఐదుగురు ఇలా జిల్లాలోని వందలాది ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య గణనీయంగా తగ్గింది. సర్దుబాటు ప్రక్రియలో ఇష్టానుసారం టీచర్లను బదిలీ చేయడంతో పిల్లలను బడికి పంపేందుకు తల్లిదండ్రులు ఇష్టపడడం లేదని తేలింది.





నాడు-నేడు పథకం కింద గత ప్రభుత్వంలో అభివృద్ధి చెందిన కార్వేటినగరం రాజాకుమారస్వామిరాజా ప్రభుత్వ పాఠశాల, కత్తెరపల్లి జెడ్పీ హైస్కూల్

విద్య సామాజిక బాధ్యత అని భారత రాజ్యాంగం చెబుతోంది. అందుకే 14 ఏళ్ల లోపు పిల్లలకు నిర్బంధ ఉచిత విద్య అందించాలని పేర్కొంది. కూటమి ప్రభుత్వం అందుకు విరుద్ధంగా వ్యవహరిస్తోంది. గత ప్రభుత్వం విద్యార్థుల సంక్షేమం కోసం అమలుచేసిన అనేక పథకాలను నిలిపేసింది. విద్యా వ్యవస్థను నిర్వీర్యం చేసింది. పలుచోట్ల తల్లిదండ్రులు తమ పిల్లలను పాఠశాలలకు పంపడం మానేస్తున్నారు. ఫలితంగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య గణనీయంగా తగ్గింది. 2023-24 విద్యాసంవత్సరంలో 1,54,191 మంది విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల్లో విద్యనభ్యసిస్తుండగా 2024-25కు ఆ సంఖ్య 1,44,500కు తగ్గింది. 9,691 మంది పిల్లలు బడి మానేశారు.

- అస్తవ్యస్తంగా మారిన విద్యావ్యవస్థ
- ప్రభుత్వ బడుల్లో తగ్గిన విద్యార్థుల సంఖ్య
- జాడలేని 'తల్లికి వందనం'
- పిల్లలను బడులకు పంపని వైనం
- గత ప్రభుత్వం ప్రారంభించిన పనులను ఆపేసిన కూటమి నేతలు

చిత్తూరు కలెక్టరేట్ : పేద విద్యార్థులు చదివే బడులను అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో గత ప్రభుత్వం నాడు-నేడు పథకానికి శ్రీకారం చుట్టింది. గతంలో ఎన్నడూ లేని విధంగా రూ.వేల కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టి స్కూళ్లను అందంగా తీర్చిదిద్దింది.

పాఠశాలల సమాచారం

ప్రాథమిక పాఠశాలలు	1,908
ప్రాథమికోన్నత పాఠశాలలు	206
ఉన్నత పాఠశాలలు	330
మొత్తం ప్రభుత్వ పాఠశాలలు	2,444

గత ఐదేళ్లలో ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల మధ్య తేడా

సంవత్సరం	ప్రభుత్వ బడుల్లో విద్యార్థులు	ప్రైవేట్ బడుల్లోని విద్యార్థులు
2019-20	3,43,734	2,35,506
2020-21	3,74,138	2,10,719
2021-22	3,82,951	1,94,263
2022-23	1,70,982	73,765
2023-24	1,54,191	79,734

కూటమి ప్రభుత్వం వచ్చాక ఈ పథకాన్ని కూడా అటకెక్కించింది. దీంతో పనులు ఆగి బడులు కళావిహీనంగా తయారయ్యాయి. అపరిశుభ్రత తాండవిస్తోంది. ఈ క్రమంలో పిల్లలను ఆకర్షించడంలో ప్రభుత్వ స్కూళ్లు వెనుకబడిపోయాయి. దీనికితోడు విద్యార్థుల చేరికలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించకపోవడంతో పిల్లల సంఖ్య గణనీయంగా తగ్గింది.

ఇష్టారాజ్యంగా సర్దుబాటు

స్కూళ్లలో సర్దుబాటు పేరుతో ఇష్టారాజ్యంగా జరిగిన నియామకాలు విద్యార్థుల అడ్మిషన్లపై తీవ్ర ప్రభావం చూపినట్టు ఉపాధ్యాయులే చెబుతున్నారు. జిల్లాలోని అన్ని మండలాల్లో విద్యార్థుల సంఖ్యకు తగినట్టు ఉపాధ్యాయులు లేరు. ముఖ్యంగా గణితం, సైన్స్, ఇంగ్లీషు సబ్జెక్టులు బోధించే టీచర్ల కొరత ఉంది. కొన్ని పాఠశాలల్లో ఇతర సబ్జెక్టు టీచర్‌తో బోధన చేయిస్తున్నారు. 'టీచర్లు ఉంటే విద్యార్థులు ఉండరు, విద్యార్థులు ఎక్కువగా ఉన్నచోట టీచర్లు ఉండరు' అన్నట్లుగా జిల్లాలో పరిస్థితి తయారైంది. జిల్లాలో చాలా చోట్ల ఇదే దుస్థితి. రాజకీయ జోక్యంతో ఇష్టారాజ్యంగా ఉపాధ్యాయుల సర్దుబాటు జరగడంతో ఇలాంటి పరిస్థితి దాపురించిందనే విమర్శలు వినిపిస్తున్నాయి.

పనులు ఆపేసిన కూటమి

జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలు గత ఐదు సంవత్సరాల్లో నాడు-నేడు పథకం కింద ఎంతో అభివృద్ధి చెందాయి. జిల్లాలో మొదటి దశ నాడు- నేడు కింద 743 పాఠశాలల్లో సుమారు రూ.182.48 కోట్లతో పనులు చేపట్టారు. రెండవ దశలో 1,209 పాఠశాలల్లో రూ.448.06 కోట్లతో పలు పనులు చేశారు. మొదటి దశలో ప్రారంభించిన పనులు 100 శాతం పూర్తి చేశారు. రెండవ దశలో చేపట్టిన పనులను కూటమి ప్రభుత్వం ఆపివేయడంతో సర్కారు బడుల్లో



ఐరాలలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిలిచిపోయిన తరగతి గదుల నిర్మాణం

అలసత్వం పనికిరాదు



గత ఐదేళ్లలో ప్రభుత్వ పాఠశాలలు ఎంతో అభివృద్ధి చెందాయి. ఇప్పుడు అభివృద్ధి కనిపించడం లేదు. తమ ప్రభుత్వం వచ్చాక చదువుకునే ప్రతి విద్యార్థికీ రూ.15 వేలు ఇస్తామని చంద్రబాబు చెప్పారు. ఇప్పటికీ పథకం అమలు కాలేదు. అసలు ఇస్తారో లేదో కూడా తెలియదు. గత ప్రభుత్వంలో ప్రైవేట్ పాఠశాలల్లో పిల్లలు చదువుతున్నా 'అమ్మ ఒడి' పథకం వర్తింపజేశారు. ప్రభుత్వ స్కూళ్లపై ఈ ప్రభుత్వం నిర్లక్ష్యం చూపుతోంది.

– షణ్ముగం, విద్యార్థి తండ్రి, పూతలపట్టు

సర్కారు బడులను అభివృద్ధి చేయాలి



సర్కారు బడుల పట్ల చిన్నచూపు కరెక్టు కాదు. వాటి అభివృద్ధిపై కూటమి ప్రభుత్వం దృష్టిపెట్టాలి. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పాఠశాలల అభివృద్ధికి కోట్లు ఖర్చు చేసింది. కార్పొరేట్ పాఠశాలలకంటే అందంగా తీర్చిదిద్దారు. అందువల్లే తల్లిదండ్రులకు బడులపై నమ్మకం కుదిరింది. కూటమి ప్రభుత్వం వచ్చాక బడులకు గడ్డు రోజులు దాపురించాయి. చంద్రబాబు ఎన్నికల్లో ఇచ్చిన మాట ప్రకారం పథకాలు అమలు చేయడంతోపాటు సర్కారు బడులను అభివృద్ధి చేయాలి.

– కేశవన్, విద్యార్థి తండ్రి, సీఎంకండ్రిగ, పాలసముద్రం మండలం

కార్యకర్తలకు అండగా ఉంటా



మృతురాలి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి రోజా, నాయకులు

- మాజీ మంత్రి ఆర్కేరోజా

విజయపురం : మండలంలోని జగన్నాథపురానికి చెందిన వైఎస్సార్ సీపీ యువ నాయకుడు బాలాజీ తండ్రి రామచంద్ర యాదవ్ ఇటీవల మృతి చెందారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి, మాజీ మంత్రి ఆర్కేరోజా ఆ సమయంలో స్థానికంగా లేకపోవడంతో గురువారం వారి స్వగృహానికి వెళ్లారు. రామచంద్ర యాదవ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. బాలాజీతో పాటు వారి కుటుంబ సభ్యుడు విశ్వనాథ్‌ను పరామర్శించారు. అలాగే మండలంలోని మహారాజపురం గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ శివకుమార్ భార్య జమున ఇటీవల మృతిచెందారు. వారి కుటుంబాన్ని కూడా మాజీ మంత్రి పరామర్శించారు. కార్యకర్తలకు అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మండల ప్రజా ప్రతినిధులు, పార్టీ కన్వీనర్ తదితరులు పాల్గొన్నారు.

రూ.5.3 కోట్లతో 14 చెరువుల అభివృద్ధి

- మల్లెలమిట్ట ప్రాజెక్టు తూము పరిశీలన
- కలెక్టర్ సుమిత్‌కుమార్

రొంపిచెర్ల: మండలంలోని 14 చెరువులను రూ.5.3 కోట్లతో అభివృద్ధి చేస్తున్నట్టు జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్ తెలిపారు. ఆయన గురువారం రొంపిచెర్ల తహసీల్దార్ కార్యాలయంలో అభివృద్ధి పనులపై అధికారులతో సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ గ్రామ సచివాలయ సిబ్బంది విధులకు సక్రమంగా హాజరుకాకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు. వారంలో రెండు సచివాలయాలను తనిఖీ చేయాలని ఎంపీడీవోను ఆదేశించారు. సకాలంలో పన్నులు వసూలు చేసి అభివృద్ధి పనులకు వినియోగించుకోవాలని సూచించారు. మండలంలోని 37 అంగన్‌వాడీ కేంద్రాల్లో వసతుల కల్పనకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. రొంపిచెర్ల క్రాస్ రోడ్డులో ఉన్న ఆదర్శ పాఠశాలలో తరగతి గదుల నిర్మాణానికి కృషి చేస్తామని తెలిపారు. వికలాంగులకు యూఐడీ నంబర్లు ఇచ్చి పరికరాలు అందజేస్తామన్నారు. మూడేళ్ల క్రితం కురిసిన వర్షానికి కూలిపోయిన బీసీ బాలుర హాస్టల్ ప్రహరీ గోడ నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని ఏఈని ఆదేశించారు. వర్షాలకు దెబ్బతిన్న గ్రామీణ ప్రాంతాల్లోని రోడ్లకు త్వరలోనే మరమ్మతులు చేపడతామన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ కిరణ్‌కుమార్, ఎంపీడీవో మధుసూదన్ రెడ్డి, డీటీ లోకేష్, ఇరిగేషన్ ఏఈ మునిరాజ, ఎంఈవోలు ఇందిర, శ్రీనివాసులు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శిరీష తదితరులు పాల్గొన్నారు.



రొంపిచెర్లలో బీసీ హాస్టల్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్

మల్లెలమిట్ట ప్రాజెక్టు పరిశీలన

గానుగచింత పంచాయతీలోని మల్లెలమిట్ట ప్రాజెక్టును జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్ పరిశీలించారు. ప్రాజెక్టు 25 ఏళ్ల క్రితం నిర్మించారని, తూము పూడి పోయిందని రైతులు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన కలెక్టర్ ప్రాజెక్టుకు సంబంధించి రూ.1.13 కోట్ల నిధులు ఉన్నాయని, వాటితో తూము మరమ్మతులు చేయాలని ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. అలాగే ప్రాజెక్టుకు సంబంధించిన రెండు కాలువల్లో పూడికతీత పనులు చేపట్టాలన్నారు.

పీహెచ్‌సీల్లో పనులు పూర్తి చేయండి

చిత్తూరు కలెక్టరేట్ : గర్భస్థ శిశువు ఆరోగ్య సంరక్షణకు చేసే స్కానింగ్‌కు సంబంధించి జిల్లాలోని 8 పీహెచ్‌సీల్లో నిర్మిస్తున్న బ్లాక్ లెవెల్ హెల్త్ యూనిట్లను వెంటనే పూర్తి చేయాలని కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ ఆదేశించారు. ఆయన గురువారం పలు శాఖల అధికారులతో సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని, అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. గర్భిణులకు పీహెచ్‌సీల్లోనే స్కానింగ్ చేసేలా చర్యలు చేపట్టాలన్నారు. డీఎంఅండ్‌హెచ్‌ఓ ప్రభావతిదేవి, పీఆర్ ఎస్ఈ శంకర్‌నారాయణ పాల్గొన్నారు.

కంటికి కడివెడు కష్టాలు!





కంటి పరీక్షలు చేస్తున్న సిబ్బంది (ఫైల్)

ఓపీ వివరాలు

సంవత్సరం	ఓపీ సంఖ్య
2021	21,456
2022	29,258
2023	31,589
2024	26,681

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పేదలకు అండగా నిలిచి మెరుగైన వైద్యం అందించి మన్ననలు పొందింది. దీన్ని కూటమి ప్రభుత్వం జీర్ణించుకోలేకపోయింది. వైఎస్సార్ సీపీపై ఉన్న కసిని పేదలపై చూపుతోంది. పండుటాకులతోపాటు విద్యార్థుల కంటికి వెలుగులు తెప్పించేందుకు ఏర్పాటుచేసిన ముఖ్యమంత్రి ఈ-ఐ కేంద్రాలను నిర్దాక్షిణ్యంగా మూసేసింది. అందులో పనిచేసే సిబ్బందిని రోడ్డున పడేసింది. వేలాది రూపాయల విలువైన పరీక్షలను ఉచితంగా అందుకునే పేదలు నేడు ప్రైవేటుకు వెళ్లలేక, ప్రభుత్వ ఆస్పత్రుల్లో వైద్యం అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తమది మంచి ప్రభుత్వం అని చెప్పుకుంటూనే పేదలకు ఉపయోగపడే ముఖ్యమంత్రి ఈ-ఐ కేంద్రాలను మూసివేయడం ఏమిటని పండుటాకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

- కంటి వైద్యానికి తప్పని తిప్పలు
- ముఖ్యమంత్రి ఈ-ఐ కేంద్రాలకు తాళం
- ఉచిత కంటి పరీక్షలు, కళ్లద్దాల పంపిణీకి మంగళం

కాణిపాకం: చిత్తూరు, తిరుపతి జిల్లాల్లోని ఏడు ప్రభుత్వ సామాజిక ఆస్పత్రుల్లో గతంలో ముఖ్యమంత్రి ఈ-ఐ కేంద్రాల్లో ప్రజలకు సేవలు అందించేవారు. ఇక్కడ ఆప్తమాలజిస్టు, అసిస్టెంట్, ఎక్విప్‌మెంట్ అసిస్టెంట్లు ఉండేవారు. 60 ఏళ్లలోపు వారందరికీ శుక్లాలు, దృష్టి లోపం వంటి వివిధ కంటి వ్యాధులకు ఉచితంగా వైద్య పరీక్షలు చేసేవారు. షుగర్ వ్యాధిగ్రస్తులకు అతి ఖరీదైన పండఢస్ రెటినో పరీక్షలు చేసి ఫలితాలను ఆయా ముఖ్యమంత్రి ఈ-ఐ కేంద్రాల్లో తెలియజేసేవారు. ప్రస్తుతం ఈ సేవలకు మంగళం పాడారు. ముఖ్యమంత్రి ఈ-ఐ కేంద్రాలకు తాళాలు వేశారు.

కంటి అద్దాల పంపిణీకి మంగళం

గతంలో 60 ఏళ్లలోపు వారికి రేషన్ కార్డు అవసరం లేకుండా ఆధార్ కార్డు ప్రాతిపదికన ముఖ్యమంత్రి ఈ-ఐ కేంద్రాల్లో కంటి వైద్య పరీక్షలు చేసేవారు. దృష్టి లోపం ఉన్న వారికి ఖరీదైన ఫైబర్ కళ్ల అద్దాలు ఇచ్చేవారు. ఆ వ్యక్తి రంగును ఎంచుకునే సౌకర్యంతో కంటి అద్దాలు, అద్దాలకు ఉండే ఫ్రేము పొందగలిగే చాన్సు ఉండేది. ఈ ఉచిత పరీక్షలు ప్రభుత్వ సెలవు దినంలో తప్ప అన్ని రోజుల్లోనూ చేసేవారు. పాఠశాలల్లో చదువుకునే చిన్నారులకు సైతం పరీక్షలు చేసి ఉచితంగా కళ్లద్దాలను పంపించేవారు. ఆపరేషన్ అవసరమైన వారికి ఎన్‌జీవోల ఆధ్వర్యంలో ఉచితంగా నాణ్యమైన ఆపరేషన్లు చేయించేవారు. ముఖ్యంగా శుక్లాలు, టెరిజం(పొర) ఆపరేషన్లను ఉచితంగా రిమ్స్‌లో చేయించేవారు. ఇవే కాకుండా ప్రభుత్వ నుంచి మల్టీ విటమిన్ టాబ్లెట్లు, సిప్లాక్స్ చుక్కలు మందు (ఐ-డ్రాప్స్)లు అందించేవారు. ఆ సేవలన్నీ ఇప్పుడు ఆపేశారు.

ఉచితంగా ఖరీదైన వైద్యం..

కంటి సమస్యలతో బాధపడుతూ ప్రభుత్వ సామాజిక ఆస్పత్రికి వచ్చే వారికి ఆధార్ కార్డు ఆధారంగా ఓపీ రాసేవారు. అందులో ఒక ఐడీని క్రియేట్ చేసి ఉచితంగా కంటి పరీక్షలు చేసేవారు. రూ.8 లక్షలకు పైగా విలువైన ఆటో రిఫ్లెక్షన్ మెషిన్, రెటీనా పరీక్షల మెషిన్ ద్వారా రెటీనా పరీక్షలను ఉచితంగా చేసేవారు. ఫలితాల ఆధారంగా వారికి మందులు అందజేసేవారు. ఈ పరీక్షలకు ప్రైవేటు ఆస్పత్రుల్లో రూ.4 వేల వరకు వసూలు చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక ఈ సేవలను నిలిపివేశారు. ఫలితంగా పేదలు ప్రైవేట్ ఆస్పత్రులకు వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది.

అయోమయంలో సిబ్బంది

ముఖ్యమంత్రి ఈ-ఐ కేంద్రాల్లో వైద్య సేవలు అందించేందుకు కేంద్రానికి ఇద్దరు చొప్పున 14 మందిని 2017లో ఒక ప్రైవేటు ఏజెన్సీ ద్వారా నియమించారు. వారు తిరుపతి, చిత్తూరు జిల్లాల్లోని ఏడు కేంద్రాల్లో పనిచేస్తున్నారు. ఈ- ఐ కేంద్రాలను టీడీపీ ప్రభుత్వం మూసివేయడంతో కాంట్రాక్ట్ విధానంలో పనిచేస్తున్న ఆప్తాల్మిక్ ఆఫీసర్లు, ఎక్విప్‌మెంట్ అసిస్టెంట్ల పరిస్థితి అయోమయంగా మారింది.



పి.కొత్తకోట సీహెచ్‌సీలోని ఈ-ఐ సెంటర్‌కు వేసిన తాళం

మూతబడిన సెంటర్లు ఇవే..

చిత్తూరు, తిరుపతి జిల్లాల్లోని పుంగనూరు, పి.కొత్తకోట, పీలేరు, తంబళ్లపల్లి, చంద్రగిరి, సత్యవేడు, నారావారిపల్లి ప్రభుత్వ సామాజిక ఆస్పత్రుల్లో ముఖ్యమంత్రి ఈ-ఐ కేంద్రాలు ఏర్పాటు చేశారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం రాకతో ఈ సెంటర్లను మూసివేశారు.

ముసలోళ్లకు ఇబ్బంది నాయనా..



ఇన్నాళ్లు ఈడ...ఊరికే కంటి పరీక్ష చేస్తా ఉండారు. కంటి చూపు మందగించినోళ్లకు పరీక్షలు చేసి ఆపరేషన్ చేయిస్తా ఉన్నారు. కంటి అద్దాలు కూడా ఇస్తా ఉండిరి. నెలకు ముందు కంటి పరీక్ష చేసే గదికి తాళం వేసినారు. ఇదేమేని ఈడుండేవాళ్లను అడిగితే కాంట్రాక్ట్ అయిపోయిందని, అందుకే మూసేశారని అంటుండారు. మా ముసులోళ్లకు కంటి పరీక్షలు చేయడం అనుకూలంగా ఉండేది. ఎందుకు ఇలా చేసినారో అర్థం కావడం లేదు. స్వామి మాముసులోళ్లు ఇబ్బంది పడుతుండారు. ఈ సెంటర్‌ను తెరిపిస్తే బాగుండు.

– బాలిరెడ్డి, పోలవరం, పూతలపట్టు

ఓవర్‌లోడ్ సమస్యలు తగ్గించాలి



సమావేశంలో ఈఈ మునిచంద్ర, డీఈలు, ఏఈలు

చిత్తూరు కార్పొరేషన్: విద్యుత్ ఓవర్ లోడ్ సమస్యలు తగ్గించేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని ట్రాన్స్‌కో తిరుపతి, చిత్తూరు జిల్లాల ఎస్ఈలు సురేంద్రనాయుడు, ఇస్మాయిల్‌అహ్మద్ అధికారులను ఆదేశించారు. వారు గురువారం ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని ఈఈ, డీఈ, ఏఈలతో వీడియోకాన్ఫరెన్స్ నిర్వహించారు. వారు మాట్లాడుతూ 33, 11 కేవీ లైన్ల పరంగా ఏయే ప్రాంతాల్లో ట్రిప్పింగ్ సమస్యలు వస్తున్నాయో నివేదికలు ఇవ్వాలని, వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. ట్రాన్స్‌ఫార్మర్ల మీద ఓవర్ లోడ్ పడుతున్న ప్రాంతాల్లో అదనపు ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు చేస్తామన్నారు. వేసవిలో ఎక్కడా విద్యుత్ సమస్యలు రాకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండి విధులు నిర్వహించాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఈఈలు మునిచంద్ర, సురేష్, డీఈలు ప్రసాద్, ఆనంద్, ఏఈలు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఒంటరి మహిళపై టీడీపీ కార్యకర్త లైంగిక వేధింపులు

–పోలీసులకు బాధితురాలి ఫిర్యాదు



ఒంటరి మహిళను బెదిరిస్తున్న మధుసూదన్

పలమనేరు : గత కొన్ని రోజులుగా ఒక వ్యక్తి తనను లైంగికంగా వేధిస్తున్నాడని పలమనేరు మెప్మాలో పనిచేసే ఆర్‌పీ గాయత్రి గురువారం స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆమె మాట్లాడుతూ కొన్ని నెలలుగా తన భర్త ఇంట్లో లేడని తెలిపారు. దీన్ని అలుసుగా తీసుకున్న తమ ప్రాంతానికే చెందిన టీడీపీ కార్యకర్త అని చెప్పుకుంటున్న మధుసూదన్ తాను ఒంటరిగా ఉన్నప్పుడు బెదిరించడంతోపాటు దుర్భాషలాడుతున్నాడని, వ్యంగంగా మాట్లాడుతున్నాడని వాపోయారు. రాత్రిళ్లు ఇంటివద్దకొచ్చి తలుపులు తట్టి బెదిరిస్తున్నాడని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయాన్ని పట్టణానికి చెందిన టీడీపీ నాయకులకు చెప్పానని, వారి సూచనల మేరకు ఫిర్యాదు చేసినట్టు తెలిపారు.

రైలు కింద పడి యువకుడి ఆత్మహత్య



మృతదేహాన్ని పరిశీలిస్తున్న రైల్వే పోలీసులు

కుప్పం రూరల్ : తన ప్రేమను తల్లిదండ్రులు అంగీకరించలేదని జీవితంపై విరక్తి చెందిన యువకుడు రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన గురువారం కుప్పం రైల్వేస్టేషన్ సమీపంలోని గుల్లేపల్లి వద్ద చోటు చేసుకుంది. రైల్వే హెడ్ కానిస్టేబుల్ నాగరాజు కథనం మేరకు.. గుడుపల్లె మండలం కంచిబందార్లపల్లికి చెందిన కిరణ్(18) ఒక యువతిని ప్రేమించాడు. ఈ విషయం ఇంట్లో తెలియడంతో తల్లిదండ్రులు మందలించారు. దీంతో మనస్తాపం చెందిన కిరణ్ కుప్పం సమీపంలోని గుడుపల్లె వద్ద రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. గురువారం ఉదయం విషయం తెలుసుకున్న రైల్వే పోలీసులు అక్కడికి చేరుకుని మృతదేహానికి కుప్పం ఏరియా ఆస్పత్రిలో పోస్టుమార్టం చేయించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు రైల్వే హెడ్ కానిస్టేబుల్ నాగరాజు తెలిపారు. అందరితోనూ కలివిడిగా ఉండే కిరణ్ ఆత్మహత్య చేసుకోవడంతో గ్రామంలో విషాదచాయలు అలుముకున్నాయి. కుటుంబ సభ్యుల ఆర్తనాదాలు మిన్నంటాయి.

గ్రానైట్ పరిశ్రమ కుదేలు

'మేమొస్తే పరిశ్రమల స్పీడు పెంచుతాం. నిరుద్యోగులకు ఉపాధి కల్పిస్తాం. సంపద సృష్టించి సూపర్ సిక్స్ పథకాలను అమలుచేస్తాం' అని కూటమి నేతలు ఎన్నికల ముందు బాకా ఊదారు. అధికారంలోకి వచ్చిన తర్వాత కొత్త పరిశ్రమలను తీసుకురాలేదు సరికదా ఉన్న పరిశ్రమల్లో పనులు జరగకుండా అడ్డుకుంటూ సంక్షోభంలోకి నెట్టేస్తున్నారు. కుప్పం నియోజకవర్గానికి ఓ ప్రత్యేక గుర్తింపును, విదేశీ మారకద్రవ్యాన్ని తెచ్చిపెట్టిన గ్రానైట్ పరిశ్రమ నాలుగు నెలలుగా తీవ్ర సంక్షోభంలో కూరుకుపోయింది. ప్రభుత్వం పర్మిట్లను జారీ చేయకపోవడంతో లావాదేవీలు ఆగిపోయాయి. పనులు లేక సుమారు 15 వేల మందికి పైగా కార్మికులు ఇబ్బందులు పడుతున్నారు.



పనులు ఆగిపోయిన క్వారీలో వృథాగా ఉన్న రాతి బ్లాకులు, యంత్రాలు

- పర్మిట్ల జారీపై సర్కారు మెలికలు
- నిబంధనల పేరుతో అధికారిక వసూళ్లు
- తమ్ముళ్లకు కప్పం కడితేనే రవాణా
- 4 నెలల్లో రూ.300 కోట్ల వరకూ నష్టం
- 15 వేల మంది ఉపాధిపై ప్రభావం

శాంతిపురం: కుప్పం నియోజకవర్గంలోని శాంతిపురం, గుడుపల్లి, కుప్పం మండలాల్లో అధికారికంగా 95 క్వారీలు నడుస్తున్నాయి. అనధికారికంగా చిన్నచిన్న క్వారీలు నడుస్తున్నాయి. వాటిలో తయారైన రాతి బ్లాకులు దేశ, విదేశాలకు ఎగుమతి అవుతున్నాయి. కూటమి ప్రభుత్వం పర్మిట్ల జారీని ఆపివేయడంతో క్వారీల్లో పనులు ఆగిపోయాయి. దీనివల్ల సుమారు రూ.300 కోట్లకు పైగా లావాదేవీలు ఆగిపోయినట్టు పరిశ్రమ వర్గాలు చెబుతున్నాయి. వ్యాపారులు స్థానిక అధికార పార్టీ నాయకులను ప్రసన్నం చేసుకోవడంతో గత వారం చివర నుంచి అధికారులు పర్మిట్లు ఇస్తున్నా ఇప్పటి వరకూ పది క్వారీలకు కూడా పర్మిట్లు జారీ కాని పరిస్థితి. రాతి పనులపై ఆధారపడి 15 వేల మందికి పైగా కార్మికులు, రవాణా ఆపరేటర్లు, చిరు వ్యాపారులు జీవనం సాగిస్తున్నారు. పనులు ఆగిపోవడంతో వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

పెట్టుబడి పెట్టి విలవిల

క్వారీ తవ్వకాలు, బ్లాకుల కటింగ్ కోసం నిర్వాహకులు వడ్డీకి నగదు తెచ్చి పెట్టుబడి పెట్టారు. వ్యాపారులు అడ్వాన్సు ఇస్తే బ్లాకులను రవాణా చేసి వచ్చిన సొమ్ములో కొంత అప్పులకు చెల్లించి మిగిలిన సొమ్ముతో మళ్లీ పనులు చేయించేవారు. ఇప్పుడు లావాదేవీలు పూర్తిగా ఆగిపోయాయి. అడ్వాన్సు ఇచ్చిన వ్యాపారులు బ్లాకుల కోసం వెంటపడుతున్నారు. రవాణా అనుమతులు రాకపోవడంతో కూలీలతో పనులు చేయించుకోలేక దాదాపు అన్ని క్వారీల్లోనూ పనులు పూర్తిగా ఆపివేశారు. ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన నిపుణులైన కార్మికులను స్వస్థలాలకు పంపేశారు. బ్లాకులను పంపాలని వ్యాపారుల నుంచి, వడ్డీ కట్టాలని అప్పులు ఇచ్చిన వారి నుంచి ఒత్తిడి పెరగడంతో కొందరు క్వారీ నిర్వాహకులు ఫోన్లు స్విచ్ ఆఫ్ చేసుకుని, కొత్త నంబర్లతో అజ్ఞాతవాసం చేస్తున్నారు.

పర్మిట్ల కిరికిరి

గ్రానైట్ బ్లాకులను ఓడరేవులకు రవాణా చేసేందుకు అవసరమైన పర్మిట్ల జారీపై ప్రభుత్వం మెలికలు పెట్టింది. దీనికితోడు తెలుగు తమ్ముళ్ల మితిమీరిన జోక్యం చేసుకుంటుండడంతో క్వారీ పరిశ్రమ సంక్షోభంలో కూరుకుపోయింది. గత ప్రభుత్వ హయాంలో క్వారీ నుంచి తీసిన బ్లాకు కొలతలను ఆన్‌లైన్‌లో నమోదు చేసేవారు. వాటిని ప్రయివేటు కంపెనీ సిబ్బంది తనిఖీ చేసి కొలతలు సరిపోలితే పన్నులు చెల్లించాల్సి వచ్చేది. ఎలాంటి లంచాలు ఇవ్వకుండానే నాలుగు గంటల వ్యవధిలో పర్మిట్లు జారీ అయ్యేవి. ఇప్పుడు మొదట ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుంటే మైన్స్ అండ్ జియాలజీ అధికారులు నేరుగా పరిశీలించి అప్రూవ్ చేశాక ప్రైవేటు ఏజెన్సీకి వెళ్తున్నాయి. వాళ్లు వచ్చి పరిశీలించాక నిర్ణీత పన్నులు చెల్లించాక పర్మిట్లు ఇస్తున్నారు. ఈ ప్రక్రియకు 4 నుంచి 6 రోజుల వరకూ సమయం పడుతోంది. లంచాల రూపంలో క్వారీ నిర్వాహకులపై అదనపు భారం పడుతోంది. అన్ని అనుమతులు ఉన్న క్వారీలో పనులు చేసి బ్లాకులు ఎగుమతి చేయాలన్నా అధికార పార్టీ నేతలను ప్రసన్నం చేసుకోక తప్పడం లేదు. మరోవైపు క్వారీ నుంచి లోడు లారీ రోడ్డుపైకి రాగానే దానిని అడ్డగించి ఆపేస్తున్న తెలుగు తమ్ముళ్ల డిమాండ్లు తీర్చాకే వాహనాలు ముందుకు సాగాల్సిన పరిస్థితి. ఈ తతంగం వల్ల జీపీఎస్ ఆధారంగా నిర్ణీత సమయంలోపు, నిర్దేశిత మార్గంలో ఓడరేవులకు చేరాల్సిన వాహనాలు ఆలస్యం అవుతున్నాయి. పర్యవసానంగా పెనాల్టీల రూపంలో క్వారీ వ్యాపారులపై అదనపు భారం పడుతోంది. క్వారీ పరిశ్రమ కొనసాగాలంటే ప్రభుత్వం సింగిల్ విండో పద్ధతిలో నిబంధనల మేరకు అనుమతులు ఇవ్వాలని, రాజకీయ నాయకుల జోక్యం లేకుండా నిబంధనల మేరకు స్వేచ్ఛగా పనులు చేసుకునే అవకాశం కల్పించాలని క్వారీల నిర్వాహకులు కోరుతున్నారు.

వివాదంగా మారిన దారి

శాంతిపురం: మండలంలోని మొరసనపల్లి పంచాయతీ పాకంపల్లికి చెందిన నాలుగు దళిత కుటుంబాల వారు తమ వ్యవసాయ భూములకు వెళ్లే దారి వివాదాస్పదమైంది. మొరసనపల్లి రెవెన్యూలో నారసింహేపల్లి సమీపంలో 0.66 ఎకరాల ప్రభుత్వ శ్మశాన భూమిలో ఓసీ, బీసీల మృతదేహాలను ఖననం చేస్తున్నారు. అక్కడే ఒక చివర ఉన్న దారి గుండా పాకంపల్లికి చెందిన నాలుగు కుటుంబాల వారు ఏళ్ల తరబడి తమ పొలాలకు రాకపోకలు సాగిస్తున్నారు. ఇటీవల కొందరు స్థానిక నాయకులు శ్మశాన భూమిని సర్వే చేయించి చుట్టూ ట్రెంచి తవ్వించారు. దీంతో తమ భూములకు, వాటిలోని కోళ్లఫారాలకు దారి లేకుండా పోయిందని బాధిత దళిత కుటుంబాలు కుప్పం ఆర్డీవో, శాంతిపురం తహసీల్దారుకు వినతి పత్రాలు ఇచ్చారు. ఆర్డీవో శ్రీనివాసులు, శాంతిపురం తహసీల్దార్ శివయ్య గురువారం తమ సిబ్బందితో దారిని పరిశీలించారు. ఇరువర్గాలతో చర్చించారు. దళిత కుటుంబాల వారు రోడ్డు కోసం వాడుకుంటున్న భూమికి సమానంగా వారి సొంత భూమిని శ్మశానానికి ఇచ్చేలా తీర్మానించారు. ఈ మేరకు సిబ్బందితో సర్వే చేయించి హద్దులను చూపారు. శ్మశాన భూమిలో రాకపోకలు సాగించేందుకు తమ సొంత భూమిని వదులుకోవాల్సి వచ్చిందని బాధితులు వాపోయారు.

ఐదుగురు దొంగల అరెస్టు



గుడిపాల: నిందితుల అరెస్టు చూపుతున్న డీఎస్పీ సాయినాథ్

గుడిపాల: వాహనాలను అడ్డగించి చోరీ చేస్తున్న దొంగల ముఠాలోని ఐదుగురిని అరెస్టు చేసినట్టు డీఎస్పీ సాయినాథ్ తెలిపారు. ఆయన గురువారం గుడిపాల పోలీస్‌స్టేషన్‌లో విలేకరులకు వివరాలు వెల్లడించారు. గత నెల 27వ తేదీ రాత్రి బెంగళూరు నుంచి చెన్నై, అరక్కోణానికి కారులో గుట్కా ప్యాకెట్లుఅక్రమంగా రవాణా చేస్తున్నారు. కారును మరో ముఠాకు చెందిన దుండగులు గుడిపాల మండలం కమ్మతిమ్మాపల్లె క్రాస్‌లోని కందగిరి కొండ సమీపంలో అడ్డగించారు. కారుతో పాటు గుట్కా ప్యాకెట్లను తీసుకెళ్లారు. దీనిపై గుడిపాల పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది. సీఐ శ్రీధర్, ఎస్ఐ రామ్మోహన్, సిబ్బందితో ప్రత్యేక బృందం ఏర్పాటుచేసి దర్యాప్తు చేపట్టారు. రెండు ముఠాలు తమిళనాడు రాష్ట్రం వేలూరు జిల్లాకు చెందినట్టు గుర్తించారు. ఈ క్రమంలో కమ్మతిమ్మాపల్లె క్రాస్ వద్ద దండగులను అరెస్టు చేశారు. వారి నుంచి రూ.5 లక్షల విలువైన కారును స్వాధీనం చేసుకున్నారు. అలాగే దాడి చేసిన ముఠా ఉపయోగించిన రెండు టాటాఏస్ వాహనాలను కూడా స్వాధీనం చేసుకున్నారు. ఈ ముఠాలో ఏడుగురు ఉన్నారని, ఐదుగురిని అరెస్టు చేశామని, మరో ఇద్దరిని త్వరలోనే అరెస్టు చేస్తామని డీఎస్పీ తెలిపారు. అరెస్టు అయిన వారిలో షఫీ(36), జావిత్(26), షాబుద్దీన్(32), రాజేష్‌ఖన్నా(23), ఆసిఫ్ బేగ్(33) ఉన్నారని వెల్లడించారు. నిందితులను పట్టుకోవడంలో ప్రతిభచూపిన సీఐ శ్రీధర్, ఎస్ఐ రామ్మోహన్, టెక్నికల్ టీం సిబ్బంది దేవరాజులు, రామారావు, రవి, వేణు, గోపి, రుషిని డీఎస్పీ అభినందించారు.

నేడు జిల్లాలో సఫాయి కర్మచారి చైర్మన్ పర్యటన

చిత్తూరు కలెక్టరేట్ : సఫాయి కర్మచారి చైర్మన్ వెంకటేశన్ శుక్రవారం చిత్తూరు జిల్లాలో పర్యటిస్తారని కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ తెలిపారు. ఆయన గురువారం విలేకరులతో మాట్లాడుతూ వెంకటేశన్ శుక్రవారం మధ్యాహ్నం 2 గంటలకు చిత్తూరుకు చేరుకుని, మధ్యాహ్నం 3 గంటలకు పారిశుద్ధ్య కార్మికుల కాలనీలను పరిశీలిస్తారని పేర్కొన్నారు. మధ్యాహ్నం 3.30 గంటలకు పారిశుద్ధ్య కార్మికులకు అందుతున్న సంక్షేమ పథకాల అమలుపై కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో సమావేశం నిర్వహిస్తారని తెలిపారు. అనంతరం రాత్రి 7 గంటలకు ఆయన తిరుపతి జిల్లాకు బయలుదేరి వెళ్తారని వెల్లడించారు.

బాధిత కుటుంబానికి ఎక్స్‌గ్రేషియా మంజూరు

చిత్తూరు కలెక్టరేట్ : 2020 మే 30న పిడుగుపాటుకు గంగవరం మండలానికి చెందిన ముగ్గురు వ్యక్తులు మృతి చెందారు. ఈ మేరకు అప్పటి కలెక్టర్ ఎక్స్‌గ్రేషియా నిమిత్తం ప్రభుత్వానికి నివేదికలు పంపారు. రామకృష్ణ(తండ్రి), ఆయన కుమార్తెలు రమాదేవి, మీనాకుమారి మృతి చెందారు. వారి కుటుంబ సభ్యులను ఆదుకోవాలని కలెక్టర్ కోరారు. ఈ క్రమంలో మృతి చెందిన ఒక్కొక్కరికి రూ.4 లక్షల చొప్పున రూ.12 లక్షల ఎక్స్‌గ్రేషియాను మంజూరు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది.

శ్రీవారి దర్శనానికి 8 గంటలు

తిరుమల: తిరుమలలో గురువారం భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 8 కంపార్ట్‌మెంట్లు నిండాయి. బుధవారం అర్ధరాత్రి వరకు 75,371 మంది స్వామివారిని దర్శించుకున్నారు. 24,065 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.4.21 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టిక్కెట్లు కలిగిన వారికి సకాలంలోనే దర్శనం లభిస్తోంది. దర్శన టిక్కెట్లు లేని భక్తులు స్వామివారిని దర్శించుకోవడానికి 8 గంటల సమయం పడుతోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు కలిగిన వారికి 2 గంటల్లో దర్శనం లభిస్తోంది. ఇదిలా ఉంటే సర్వదర్శనం టోకెన్లు కలిగిన భక్తులు నిర్దేశించిన సమయానికి క్యూలోకి వెళ్లాలని టీటీడీ విజ్ఞప్తి చేస్తోంది. కేటాయించిన సమయాన్ని కంటే ముందు వెళ్లిన వారికి క్యూలోకి అనుమతించరని స్పష్టం చేస్తోంది.

నేటి నుంచి రూ.99 మద్యం



చిత్తూరు అర్బన్: జిల్లాలోని మద్యం డిపోలకు రూ.99 క్వార్టర్ బాటిల్ మద్యం చేరింది. అధికారంలోకి వస్తే రూ.99లకే నాణ్యమైన మద్యం ఇస్తామని ప్రకటించిన కూటమి ప్రభుత్వం వీఎస్‌వోపీ బ్రాందీని, ట్రోపికనా పేరిట చీప్ లిక్కర్‌ను విడుదల చేసింది. చిత్తూరు మద్యం డిపోకు గురువారం దాదాపు 700 పైచిలుకు బాక్సుల మద్యం స్టాకు వచ్చింది. వీటిని శుక్రవారం నుంచి వ్యాపారుల డిమాండ్ మేరకు అందించనున్నట్లు డిపో మేనేజరు మనోహర్‌రెడ్డి తెలిపారు. ఉన్న స్టాకు ఆధారంగా సగటున ఒక్కో దుకాణానికి ఆరు బాక్సులకు మించి చీప్ లిక్కర్‌ను సరఫరా చేసే అవకావం కనిపించడం లేదు. దీన్ని అధిగమించడానికి ఏం చేస్తారో వేచి చూడాల్సి ఉంది. మరోవైపు దుకాణాల్లో ఇప్పటికే ఇష్టారాజ్యంగా ధరలు పెంచి మద్యాన్ని విక్రయిస్తున్న వ్యాపారులు, మద్యం ప్రియులను దోచుకోవడానికి చీప్ లిక్కర్ రేటును ఎంతకు విక్రయిస్తారో తెలియడంలేదు.

జాబ్‌మేళాలో 31 మందికి ఉద్యోగాలు

పలమనేరు : రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఎంప్లాయ్‌మెంట్ ఎక్ఛేంజ్, సీడప్, డీఆర్‌డీఏ సంయుక్తంగా గురువారం పలమనేరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాబ్‌మేళా నిర్వహించారు. ఇందులో 68 మంది అభ్యర్థులు పాల్గొనగా 31 మంది ఉద్యోగాలకు ఎంపికై నట్టు డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ బాబు తెలిపారు. ఈ కార్యక్రమానికి జిల్లా ప్లేస్‌మెంట్ ఆఫీసర్లు చైతన్య, లోకేష్, పవన్ కుమార్, సిసింద్రి, బహుళజాతి కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.

మొదలైన మద్యం దందా

- ఇది చిత్తూరు నగరంలోని ప్రైవేటు మద్యం దుకాణంలోని చీప్ లిక్కర్. దీనిపైన ఎమ్మార్పీ రూ.120 ఉంది. దీన్ని కొన్ని దుకాణాల్లో రూ.130, మరికొన్ని దుకాణాల్లో రూ.140 వరకు విక్రయిస్తున్నారు. ఎమ్మార్పీ కంటే ఎక్కువ ఎందుకు వసూలు చేస్తున్నారని మద్యం ప్రియులు ప్రశ్నిస్తే.. చేతిలో ఉన్న బాటిల్‌ను లాక్కుంటున్నారు.

- ఒక వ్యక్తికి లాటరీలో వచ్చిన దుకాణాన్ని తమ ప్రాంతంలో పెట్టొద్దంటూ చిత్తూరు నగరంలోని డీఐ రోడ్డులో స్థానికులు ఆందోళన చేపట్టారు. అధికారులు ఇచ్చిన గెజిట్ ప్రకారమే తాను దుకాణం పెడుతున్నానని వ్యాపారి చెప్పినా ఫలితం లేదు. తీరా విచారిస్తే అసలు విషయం బయటపడింది. మద్యం సిండికేట్‌లో చేతులు కలపనందుకు ఇలా జనాన్ని ఉసిగొలుపుతున్నారని ఆ వ్యాపారి గ్రహించాడు. చేసేదేమీలేక మరోచోట దుకాణాన్ని ఏర్పాటుచేసుకున్నాడు.

చంద్రబాబునాయుడు ఎన్నికలకు ముందు చెప్పినట్టే నూతన మద్యం పాలసీని తీసుకువచ్చారు. ప్రైవేట్ మద్యం దుకాణాలకు అనుమతులు మంజూరు చేశారు. ఇప్పటి వరకు బాగానే ఉంది. దుకాణాలను దక్కించుకున్న కూటమి నేతలు సిండికేట్‌గా మారారు. ఎమ్మార్పీకంటే ఎక్కువకు మద్యాన్ని విక్రయిస్తూ దందాకు తెరలేపారు. దుకాణాల వద్దే సిట్టింగ్ గదులు ఏర్పాటుచేసి పూటుగా మద్యం తాగిస్తున్నారు. తద్వారా తమ పెట్టుబడికి పదింతలు రాబట్టుకోవడానికి సిద్ధమయ్యారు. తాము చెప్పినట్టు వినని వ్యాపారులు మద్యం దుకాణాలు ఏర్పాటుచేయకుండా మహిళలతో ధర్నాలు చేయిస్తున్నారు. ఇంత జరుగుతున్నా అధికారులు నోరు మెదపకపోవడంపై పలు విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.



జిల్లాలో అధిక ధరలకు అమ్ముడవుతున్న మద్యం బ్రాండ్



చిత్తూరు డీఐ రోడ్డులో షాపు వద్దంటూ స్థానికుల నిరసన

- ఎక్కడికక్కడ అనధికారిక సిట్టింగ్ గదులు
- ఇష్టానుసారంగా ధరలు పెంచేసిన వైనం
- ఎవరికి ఫిర్యాదు చేయాలో తెలియక అయోమయం
- సిండికేట్ మాట వినకుంటే.. మహిళలతో ధర్నాలు

చిత్తూరు అర్బన్ : జిల్లాలో 104 మద్యం దుకాణాలకు అనుమతులు మంజూరయ్యాయి. గురువారానికి 73 దుకాణాలు ప్రారంభమయ్యాయి. వీటిల్లో మద్యం అమ్మకాలు కూడా జరుగుతున్నాయి. మద్యం ధరలను బాటిళ్లపై ముద్రించింది. చిత్తూరులో ఏ బాటిల్ ఎంతకు విక్రయించాలనే విషయం సిండికేట్లు నిర్ణయిస్తున్నారు. దుకాణాలు దక్కించుకోవడానికి తాము 60 అప్లికేషన్లు వేశామని కొందరు, తాము 120 దరకాస్తులు వేశామని మరికొందరు గగ్గోలు పెడుతున్నారు. వందల దరకాస్తులు వేస్తే తమకు వచ్చింది రెండు, మూడు దుకాణాలేనని.. ఒక్కో దరకాస్తుకు రూ.2 లక్షల చొప్పున పోగొట్టుకున్న నగదు మొత్తం రాబట్టాలంటే ఆ భారాన్ని మద్యం ప్రియులపై మోపాలనుకున్నారు. ఇందులో భాగంగా దుకాణాల వ్యాపారుల్లో 95 శాతం మంది కూటమిగా ఏర్పడి మద్యం ప్రియుల జేబుల నుంచి నగదు కొల్లగొడుతున్నారు.

అధికారుల గప్‌చుప్..

మద్యం విక్రయాల్లో బహిరంగంగానే ఎమ్మార్పీని ఉల్లంఘిస్తున్నా అడిగే దిక్కులేకుండా పోయింది. కనీసం ఉల్లంఘన జరిగితే తమకు ఫిర్యాదు చేయాలని దుకాణాల వద్ద ఫోన్ నంబర్లను కూడా అందుబాటులో ఉంచలేదు. కేసులేవీ లేనప్పుడు పెట్టీ కేసులు నమోదు చేయడంతోపాటు రోడ్డుపై సిగరెట్ తాగుతున్నారని జరిమానా విధించే పోలీసులు బహిరంగ మద్యపానంపై ఏ మాత్రం దృష్టి సారించడం లేదు. ఇక పాలసీలో ప్రస్తావించని సిట్టింగ్ రూమ్‌ల ఏర్పాటుపై ఎక్సైజ్ అధికారులు నోరు మెదపడం లేదు. అధికార పార్టీ నేతల ఒత్తిళ్లకు తలొగ్గి, వారికి సలాం కొడుతున్నారనే విమర్శలున్నాయి. మరికొందరు అధికారులు సిండికేట్లతో నెలసరి మామూళ్లకు ఒప్పందం కుదుర్చుకుని ఎమ్మార్పీ ఉల్లంఘన, సిట్టింగ్ గదుల ఏర్పాటుకు అనధికారిక అనుమతులు ఇచ్చారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

యథేచ్ఛగా సిట్టింగ్ గదుల ఏర్పాటు

నూతన మద్యం పాలసీలోని నిబంధనల ప్రకారం దుకాణం నుంచి మద్యాన్ని తీసుకెళ్లిపోవాలి తప్ప.. అక్కడే నిలబడి లేదా గదిలో కూర్చుని తాగడానికి వీలు లేదు. చిత్తూరులోని ప్రతి మద్యం దుకాణం పక్కనే సిట్టింగ్ గదులు వెలిశాయి. ఇవి మినీ బార్లను తలపిస్తుండడంతో తమ వ్యాపారానికి గండి పడుతోందని మద్యం బార్ల యజమానులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరికొన్ని చోట్ల దుకాణం పక్కనే రోడ్లపై నిలబడి మద్యం సేవిస్తున్నారు. చట్ట ప్రకారం బహిరంగ మద్యపాన సేవనం నేరం. దీనిపై పోలీసులు కేసులు కూడా నమోదు చేయొచ్చు.

రామాయణంతోనే కుటుంబ వ్యవస్థ పటిష్టం

- ఘనంగా వాల్మీకి మహర్షి జయంతి వేడుకలు
- నివాళులర్పించిన జాయింట్ కలెక్టర్ విద్యాధరి



వాల్మీకి జయంతి వేడుకల్లో పాల్గొన్న జేసీ విద్యాధరి

చిత్తూరు కలెక్టరేట్ : వాల్మీకి మహర్షి రచించిన రామాయణంతోనే కుటుంబ వ్యవస్థ పటిష్టమైందని జాయింట్ కలెక్టర్ విద్యాధరి తెలిపారు. కలెక్టరేట్‌లో గురువారం వాల్మీకి మహర్షి జయంతిని ఘనంగా జరుపుకున్నారు. ఇందులో అతిథిగా పాల్గొన్న జేసీ మాట్లాడుతూ వాల్మీకి మహర్షి మహోన్నత వ్యక్తి అని కొనియాడారు. ఆయన సమాజానికి విలువైన గ్రంథాలు అందించారన్నారు. జిల్లా బీసీ సంక్షేమ శాఖ డీడీ రబ్బానీ బాషా మాట్లాడుతూ వాల్మీకి కృషి, పట్టుదలకు నిదర్శనమన్నారు. కార్యక్రమంలో బీసీ కార్పొరేషన్ ఈడీ శ్రీదేవి, కలెక్టరేట్ ఏఓ కులశేఖర్, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.